ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 11.05.2024 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకుంది. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగిలిన చోట్ల 6 గంటలతో ప్రచార గడువు ముగుస్తుంది.
2. నేడు ఆఖరి రోజు కూడా ప్రధాన పార్టీలు హోరాహోరిగా ప్రచారం చేస్తున్నాయి. బిజెపి తరుపున అమిత్ షా వికారాబాద్ లోను, కాంగ్రెస్ తరుపున రేవంత్ రెడ్డి పటాన్ చెరులోను ఎన్నికల సభల్లో పాల్గొన్నారు.
3. గత పదేళ్లలో బిజెపి ప్రభుత్వం తీవ్రవాదం, ఆర్థిక సంక్షోభం నుంచి దేశానికి విముక్తి కలిగించిందని సికింద్రాబాద్ బిజెపి ఎంపి అభ్యర్థి కిషన్ రెడ్డి అన్నారు.
4. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, 150 రోజుల కాంగ్రెస్ పాలన అబద్దంగా మారిందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు.

<u>ప్రచారం</u>

తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రంతో ముగుస్తుంది. 17 లోక్ సభ నియోజకవర్గాల పరిధిలోని 119 అసెంబ్లీ సెగ్మెంట్లలో 106 చోట్ల సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగియనుండగా, మరో 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సాయంత్రం 4 గంటలకే ప్రచారం ముగుస్తుంది. నక్సల్ ప్రభావిత ప్రాంతాలైన ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, భద్రాచలం, పినపాక, ఇల్లందు, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ నియోజ్కవర్గాల పరిధిలో సాయంత్రం 4 గంటలకు

ప్రచారం ముగుస్తుంది. 13వ తేదిన లోక్ సభ నాల్గవ విడత ఎన్నికల్లో భాగంగా తెలంగాణలోని 17 లోక్ సభ స్థానాల్లో పోలింగ్ జరుగుతుంది. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ కూడా అదే జరుగుతుంది. మొత్తం 17 లోక్ సభ నియోజకవర్గాల్లో 50 మంది మహిళలు సహా 525 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 3 కోట్ల 32 లక్షల మంది ఓటర్ల కోసం 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 1 లక్షా 9 వేల 941 బ్యాలెట్ యూనిట్లు, 50 వేల 135 వివిప్యాట్లు, 44 వేల 906 కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉంచుతారు. సాయంత్రం ప్రచారం ముగిసిన తర్వాత ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా ఎన్నికల కమీషన్ తగిన జాగ్రత్తలు తీసుకుంది. ప్రలోభాలు, హింసాత్మక సంఘటనలపై చివరి 72 గంటలు నిఘా పెంచాలని జిల్లా ఎన్నికల అధికారులను ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. డబ్బు, మద్యం పంపిణి ఎక్కువగా జరిగే బస్తీలు, మురికివాడలపై తనిఖీలు జరపాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని మద్యం, డ్రగ్స్ రవాణను నిరోధించాలని సూచించారు. ఈరోజు సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేది సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశించింది.

డెస్క్

**యాడ్ ప్రచారం**

నేడు చివరి రోజు కూడా రాష్ట్రంలోని 17 లోక్ సభ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం జరుపుతుండగా, నాయకులు మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బిజెపి తరుపున పార్టీ జాతీయ నాయకుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొద్దిసేపటి క్రితం వికారాబాద్ లో జరిగిన బిజెపి జనసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... సర్జికల్ స్ట్రైక్ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని, అలాంటి దాడులు చేసే ధైర్యం కాంగ్రెస్ కు లేదని అన్నారు. బిజెపి ఉన్నంత వరకు పాక్ ఆక్రమిత ప్రాంతం భారత్

ఆధీనంలోనే ఉంటుందని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పటాన్ చెరులో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలోనే పటాన్ చెరు పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందిందని అన్నారు. పటాన్ చెరుకు మెట్రో రైలుపై ప్రధానమంత్రి హామీ ఇవ్వకపోవడాన్ని ఆయన విమర్శించారు.

డెస్క్/పిటిసి, సంగారెడ్డి

<u>**హైదరాబాద్ -సికింద్రాబాద్ PROFILES:**</u>

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని - సికింద్రాబాద్ , హైదరాబాద్ లోక్ సభ నియోజక వర్గాల ఎన్నికలు దేశం యావత్తు దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచీ కేంద్ర మంత్రి , BJP రాష్ట్ర అధ్యక్షుడు G కిషన్ రెడ్డి మరో సారి ఎన్నికయి , పార్టీకి హ్యాట్రిక్ సాధించాలని సర్వ శక్తులూ ఒడ్డి ప్రచారం చేస్తూండగా, హైదరాబాద్ నుంచీ MIM పార్టీ అధినేత ఐదో సారి విజయం కోసం కృషి చేస్తున్నారు. మా ప్రతినిది M S లక్ష్మి అందిస్తున్న నివేదిక:

**VOICECAST:** లోక్ సభ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న పోటీల్లో సికింద్రాబాద్, హైదరాబాద్ కీలకమైనవి. ప్రధానపార్టీల అగ్ర నేతలు పలు దఫాలుగా ఈ రెండు నియోజకవర్గాలలో ప్రచారం చేయటం , స్థానిక అభివృద్ధి , మౌలిక సదుపాయాలు లాంటి అంశాలతో పాటూ, జాతీయ సమస్యలూ ప్రముఖంగా చర్చకు రావటం , ఈ విషయాలపై వైరి పక్షాల మధ్య తీవ్ర ఆరోపణలు , ప్రత్యారోపణాలూ చోటు చేసుకోవటం, కొన్ని సందర్భాలలో అగ్ర నాయకులు నియమావళి ఉల్లంఘించారంటూ కేసులు నమోదు కావటం రాజకీయ ప్రచారాన్ని వేడెక్కించాయి.

సికింద్రాబాద్ లో ప్రధాన పార్టీలు BJP, BRS, కాంగ్రెసు నుంచి పోటీ చేస్తున్న ముగ్గురూ , అపార రాజకీయ అనుభవంతో పాటూ ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ఉన్నవారే కావటం విశేషం. వీరితో పాటూ మరో 42 మంది అభ్యర్థులూ బరిలో ఉన్నారు. 21 లక్షల పైగా ఓటర్లున్న సికింద్రాబాద్

నుంచీ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సికింద్రాబాద్ BJP అభ్యర్థి కిషన్ రెడ్డికి మద్దతుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు ప్రచారంలో పాల్గొన్నారు. నియోయజక వర్గంలో ముఖ్యంగా బస్తీలలో... పాదయాత్రలు, ఇంటింటి ప్రచారం , జీప్ యాత్ర , చేపట్టి పలు దఫాలుగా ఓటర్లను ఆకట్టుకునేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నం చేశారు. అన్ని వర్గాలకూ కేంద్రమైన సికింద్రాబాద్ లో తాను చేసిన అబివృద్ధి తనను గెలిపిస్తుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

(Soundbyte-కిషన్ రెడ్డి)

BRS అభ్యర్థి, సిట్టింగు శాసన సభ్యులు పద్మారావు గౌడ్ నియోజక వర్గంలో ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు , మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పన స్థానికంగా ప్రధాన అంశాలని , తనను గెలిపిస్తే అందుకు కృషి చేస్తాననీ చెబుతున్నారు.

(Soundbyte-పధ్మారావు)

ఖైరతాబాద్ శాసన సభ్యునిగా BRS నుంచి ఎన్నికై కాంగ్రెసు లో చేరి లోక్ సభ బరిలో నిలిచిన దానం నాగేందర్ సికింద్రాబాద్ లో గత కొన్నేళ్ళుగా అభివృద్ధి జరగలేదని , ఇప్పుడిప్పుడే కాంగ్రెసు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రచారం చేస్తున్నారు. తనను లోక్ సభకు పంపితే నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతున్నారు.

(Soundbyte-దానం నాగేందర్)

ఇక హైదరాబాద్ ను ఐదో సారి కైవసం చేసుకోవాలని MIM అధినేత అసదుద్దేన్ ఒవైసీ ప్రయత్నిస్తూండగా, ఎలాగైనా ఛార్మినార్ లో కమల వికాసం జరగాలని BJP సర్వ శక్తులు ఒడ్డుతోంది. సామాజిక కార్యకర్త , పారిశ్రామిక వేత్త కొంపెల్ల మాధవీలత ను ఎన్నికల బరిలో దింపి BJP నేరుగా ఢీ కొంటోంది. 22 లక్ష పైగా ఓటర్లున్న హైదరాబాద్ స్థానంలో BRS, కాంగ్రెసు అభ్యర్థులతో పాటూ మరో 26 మందీ బరిలో ఉండటంతో పోటీ ఆసక్తికరం అయింది.

గత 20 ఏళ్ళ నుంచీ హైదరాబాద్ పాతబస్తీని అభివృద్ధి చేసింది తనేనని అసదుద్దీన్ చెబుతున్నారు.

(Soundbyte-అసదుద్దీన్)

హైదరాబాద్ నియోజకవర్గంలో అన్నీ వర్గాలకూ అభివృద్ధి చేరాలంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడాలనీ, BJP తోనే అది సాధ్యం అని ఆ పార్టీ అభ్యర్థి మాధవీలత అంటున్నారు.

(Soundbyte-మాధవీలత)

BRS అభ్యర్థి G శ్రీనివాస్ నియోజక వర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తనకు MIM తోనే పోటీ అని అంటున్నారు.

(Soundbyte-శ్రీనివాస్)

కాంగ్రెసు అభ్యర్థిగా బరిలో దిగిన సమీర్ వలియుల్లా హైదరాబాద్ లో అభివృద్ధి అంశాలపైన పోటీ జరుగుతోందనీ, కాంగ్రెసు సంక్షేమ కార్యక్రమాలు తనకు కలసి వస్తాయనీ అంటున్నారు.

(Soundbyte-సమీర్)

ఓటు హక్కు వినియోగించుకునే నగర ఓటర్ల సంఖ్య కూడా సికింద్రాబాద్ హైదరాబాద్ లోక్ సభ ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

-------MSL & PTC Hyd

**కిషన్ రెడ్డి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, సుస్థిర ప్రభుత్వం ద్వారా తీవ్రవాదం, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడ్డామని సికింద్రాబాద్ బిజెపి ఎంపి అభ్యర్థి కిషన్ రెడ్డి అన్నారు. తార్నాక కాలని అసోసియేషన్ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చిన

తాను మొదటి నుంచి బిజెపి సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్నానని హోం శాఖ సహాయ మంత్రిగా ఆర్టికల్ 370 రద్దులో భాగమయ్యానని కిషన్ రెడ్డి తెలిపారు. మోదీ మళ్లీ ప్రధాని అయితే రాజకీయాలకు అతీతంగా దేశం మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

SDP

**KTR:**

రాష్ట్రంలో కెసిఆర్ పాలన 10 ఏళ్ల నిజం అయితే - కేంద్రంలో పదేళ్ల బిజెపి పాలన విషమని అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ 150 రోజుల పాలన అబద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు. కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గంలోని హుజురాబాద్ లో ఆయన రోడ్ షో లో పాల్గొన్నారు.  బిజెపి అయోధ్యాలయాన్ని కడితే బిఆర్ఎస్ యాదాద్రిని కట్టిందని ఆయన అన్నారు. నరేంద్రమోదీ ఏ వర్గానికి మేలు చేయలేదని, కానీ కెసిఆర్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో బండి సంజయ్ కరీంనగర్ లో గాని హుజురాబాద్ లో గాని ఎక్కడైనా కనిపించారా అని కెటిఆర్ ప్రశ్నించారు.

పిటిసి, కరీంనగర్

**ఆర్టీసి**

హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ లో ఓటు వేసేందుకు వెళ్లే వారి కోసం టిఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఏపి లోని వివిధ ప్రాంతాలకు ప్రతి రోజు
4 వందల బస్సులు నడిపిస్తున్నామని అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈనెల 10వ తేది నుంచి 15వ తేది వరకు సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర లోని పలు ప్రాంతాలకు 50 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. మరో 22 రైళ్లకు అదనపు బోగిలు ఏర్పాటు చేసింది. ఇలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వెళ్తున్న వారి వాహనాలతో పంతంగి

టోల్ ప్లాజా వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది.

డెస్క్

**పొన్నం ప్రభాకర్**

రాష్ట్రంలో ఐదు నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని ఎన్నికల కోడ్ ముగియగానే రేషన్ కార్డులు, పెన్షన్లు అందజేస్తామని బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కరీంనగర్ లో విలేకరులతో మాట్లాడుతూ... ఇప్పుడున్న పెన్షన్లను 4 వేల రూపాయలకు పెంచుతామని, ఆగస్టులో రైతులకు 2 లక్షల రుణమాఫి చేస్తామని ఆయన చెప్పారు. మత విద్వేషాలతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్న బిజెపికి గుణపాఠం చెప్పాలని ఆయన ఓటర్లను కోరారు.

పిటిసి, కరీంనగర్

**నకిలీ విత్తనాలు**

రాజన్న సిరిసిల్లా జిల్లాలో నకిలీ విత్తనాలు గుర్తించేందుకు, విత్తన దుకాణాలు తనిఖీలు చేసేందుకు టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పత్తి విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్లు కాకుండా వేరే ఎవరైనా విక్రయిస్తే టాస్క్ ఫోర్స్ కు సమాచారం అందించాలని వ్యవసాయాధికారి కోరారు.

పిటిసి, రాజన్న సిరిసిల్లా

**ఖర్చుల వివరాలు**

ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోగా తుది ఖర్చుల వివరాలు అందజేయాలని వరంగల్ లోక్ సభ నియోజవర్గ కేంద్ర ఎన్నికల పరిశీలకులు

దిలిబన్, ధీరజ్ సింఘా సూచించారు. వరంగల్ లోక్ సభ కు సంభిందించి ఇప్పటికే మూడు విడతల ఎన్నికల వ్యయ పరిశీలన నిర్వహించినట్లు వారు చెప్పారు. ఫలితాలు వెలువడిన 25వ రోజున పోటీ చేసిన అభ్యర్థులకు, వారి ప్రతినిధులకు ఎక్స్ పెండిచర్      రికన్సైల్ శిక్షణ ఉంటుందని చెప్పారు.

పిటిసి, వరంగల్

**<u>అవగాహన</u>**

ప్రజల్లో ఓటుపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలనే ఉద్దేశ్యంతో నల్లగొండలోని జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు నిజాయితీగా ఓటు వేయాలనే సందేశంతో వివిధ రకాల పాటలను జనమణమన మైకుల్లో వినిపిస్తున్నారు. పోలింగ్ ముగిసే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సంస్థ ప్రతినిధులు విజయకుమార్, రవికుమార్ తెలిపారు.

పిటిసి, నల్గొండ